క్లుప్తంగా

నేటి నుంచి ప్రతిష్ఠాపన వేడుకలు



మరికల్ : మండల కేంద్రంలో శనివారం నుంచి సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు జలాధివాసం, రెండో రోజు హోమం, మూడో రోజు గణపతి, లక్ష్మీదేవి, సరస్వతీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేడుకలు జయప్రదం చేయాలని కోరారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన



మరికల్ : నులి పురుగుల నివారణ మాత్రలు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారులు ఆశ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు శ్రావణి, అరవింద్ మాట్లాడుతూ.. ఇవి మింగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

ముళ్లపొదల్లో బస్ షెల్టర్



మరికల్ : మండలంలోని పస్పుల స్టేజీ దగ్గర ఉన్న బస్ షెల్టర్ చుట్టూ ముళ్ల చెట్లు పెరిగి బస్సు కోసం వేచి చూసే వారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. షెల్టర్‌లో వేచి చూడలేక రోడ్డుపై ఎండ, దుమ్ము ధూళితో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఎలిగండ్ల, పెద్దచింతకుంట గ్రామాల దగర కూడా ఉన్న బస్ షెల్టర్ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి గ్రామీణ స్టేజీల దగర ఉన్న బస్‌షెల్టర్లు బాగు చేయాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డుల ఏర్పాటు



మక్తల్ : ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ గౌతమ్ యోగేష్ ఆదేశాల మేరకు మక్తల్ పరిధిలోని బస్టాండ్, బొందల్‌కుంట గ్రామ క్రాసింగ్, జాతీయ రహదారిపై స్పీడు బేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాహన దారులు రోడ్డు నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ఊట్కూరు : మండలంలోని అవుసలోనిపల్లి గ్రామంలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. మొదటి బహుమతి విరాట్ కోహ్లీ జట్టుకు రూ.50 వేల నగదును ఆదిత్య పరాశ్రీ స్వామి, ద్వితీయ బహుమతి రోహిత్ జట్టు రూ.30 నగదును బీజేపీ నాయకులు బండ లక్ష్మకాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడా రంగాల్లో రాణించాలని కోరారు. క్రీడలతో క్రమశిక్షణతో పాటు శారీరక ఎదుగుదల పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు నర్సింహ, రవికుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



దామరగిద్ద : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ శివారులోని పీర్లగుట్ట ప్రాంతంలో గుట్టుగా సాగుతున్న పేకాట స్థావరంపై ఎస్‌ఐ రాజు సమక్షంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడిలో మద్దూర్ మండలానికి చెందిన పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద పది బైక్‌లు, ఒక కారు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



చింతల్‌దిన్నే పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేష్‌గౌడ్



పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో వంటను పరిశీలిస్తున్న ఎంఈఓ రామకృష్ణ

నర్వ : విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం పెద్దకడ్మూర్, కల్వాల్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో కిచెన్ షెడ్లను పరిశీలించి సూచనలు ఇచ్చారు. కిచెన్‌లో పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం బషీర్, ఉపాధ్యాయులు సుదర్శన్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి..

మరికల్ : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. మరికల్‌లోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకార్ రెడ్డి, మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం వడ్డించాలి..

మద్దూరు: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎంపీడీఓ నర్సింహారెడ్డి ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని చింతల్‌దిన్నే పాఠశాలను తహసీల్దార్, నందిపాడ్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. మధ్యహ్న భోజనం, పాఠశాలలో ఏమైనా సమ్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలతో దుర్గంధం..!

- రోడ్ల పక్కనే పడేస్తున్న వ్యాపారులు
- దుర్వాసనతో అల్లాడిపోతున్న ప్రజలు



మాగనూర్‌లో రోడ్డుపై పడేసిన కోళ్ల వ్యర్థం

మాగనూర్ : మండల కేంద్రంలోని చికెన్ వ్యాపారులు, కోళ్ల సరఫరా చేసే వ్యాన్ యజమానులు కోళ్ల వ్యర్థాలు, చనిపోయిన కోళ్లను స్థానిక చెరువు, ప్రధాన రోడ్ల వెంబడి వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల ప్రజలు దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. కంపు వాసన భరించలేక పోతున్నామని వాపోతున్నారు. నిత్యం మండల కేంద్రానికి అధికారులు, ప్రజలు నిత్యం ఈ దారిగుండే ప్రయాణం చేస్తున్న పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చికెన్ సరఫరా దారులు, చికెన్ దుకాణ యాజమానుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యర్థ్యాలను రోడ్లపై వేయకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కులగణన పారదర్శకంగా చేపట్టలేదు



మాట్లాడుతున్న సీబీ వెంకటేష్

కోస్గి రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో ఎస్సీ కులగణన పారదర్శకంగా చేపట్టలేదని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీబీ వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల జనాభా తక్కువగా చూపించారని ఆరోపించారు. ఏబీసీడీ వర్గీకరణలో కన్వర్టడ్ కులాలకు అవకాశం కల్పించద్దని వినతి చేసిన పట్టించుకోలేదన్నారు. కన్వర్టడ్ కూలాలను దళితుల నుంచి వేరుచేయాలన్నారు. లేనియెడల పోరాటాలకు సైతం సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు దేవేంద్రప్ప, పోకల లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ రేవతి

నారాయణపేట : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రేవతి సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని సత్యానారాయణ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహన దారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశకు గురికాకుండా, 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రంకెయిన్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించనున్నట్లు తెలిపారు. వాహనదారులు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు నరేష్, గోవింద్ రెడ్డి, వాహన దారులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడుదాం



బిజ్వార్‌లో సనాతన ధర్మ పరిరక్షణ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆదిత్యపరాశ్రీ

ఊట్కూరు: సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడుదామని అంబత్రయక్షేత్ర శ్రీశ్రీ ఆదిత్యపరాశ్రీ స్వామి అన్నారు. శుక్రవారం బిజ్వార్‌లోని అంబత్రయ క్షేత్రంలో గ్లోబల్ హిందూ హెరిటేజ్ పౌండేషన్ సేవ్ టెంపుల్ ఆర్గనైజేషన్ సనాతన ధర్మ పరిరక్షణ యాత్ర వాల్‌పోస్టర్ ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజం దేవాలయాలు , దేశ సంస్కృతి, శాస్త్రాలపై అధ్యయనం చేయడం అలవర్చుకోవాలన్నారు. అన్యాక్రాంతమవుతున్న దేవాలయ భూములను పరిరక్షించుకోవాలని, పురాతన దేవాలయాలకు పునర్వైభవం తీసుకురావాలని కోరారు. యాత్ర నేటి నుంచి ఏప్రిల్ 25 వరకు యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాత్ర కన్వీనర్ మీసాల లక్ష్మీనివాస్, సుధాకర్, సంపత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నం.. వ్యక్తికి దేహశుద్ధి



నిందితుడు శ్రీనివాస్

కోస్గి రూరల్ : ఆలయంలో దొంగతనానికి వచ్చి స్థానికులకు పట్టుబడిన వ్యక్తిని ప్రజలు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించగా ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ పట్టణంలోని ఇసుకబావి వద్ద ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయ సమీపంలో మద్యం సేవించి ఆలయం తాళం పగులగొట్టి చోరీకి పాల్పడుతున్నా క్రమంలో అటుగా వెళ్తున్న కొందరు శివ స్వాములు నిలదీశారు. ఈ నేపథ్యంలో స్థానికులు శ్రీనివాస్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు గురువారం రాత్రి అప్పగించారు. పోలీసు విచారణలో ఇతనిపై ఉమ్మడి జిల్లాలోని పలు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపింది. శుక్రవారం దొంగతనం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.

విగ్రహ ఏర్పాటు కోసం విరాళాల సేకరణ



సేకరణ పత్రాలు విడుదల చేస్తున్న సిద్ధలింగేశ్వర మహాస్వామి

మక్తల్ : పట్టణంలో వివేకనంద విగ్రహ ఏర్పాటు కోసం విరాళాల సేకరణ పత్రాలను నేరడుగోమ్ పీఠాధిపతి సిద్ధలింగేశ్వర మహాస్వామి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహ ఏర్పాటుకు తన వంతు సాయం చేస్తానన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యదర్శి వంశీ, కావాలి వెంకటేష్, చంద్రశేఖర్, కుర్మయ్య, శంకర్, శరణ, ఆంజనేయరెడ్డి, వినయ్, మూర్తి, రాకేష్, అక్షయ్ రాజేస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ



మక్తల్ : మండలంలోని సాయాన్‌పల్లి గ్రామంలో శివస్వాముల మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ దేవాలయం నుంచి అంజనేయస్వామి దేవాలయం వరకు పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. అనంతరం లక్ష బిల్వార్చన తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్రలో విద్యార్థులు



నారాయణపేట రూరల్ : మండలంలోని తిర్మలాపూర్ యూపీఎస్ పాఠశాల విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రకు తరలివెళ్లారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా కర్ణాటక రాష్ట్రం హంపి, అంజనాద్రి, హోస్‌పేట్ డ్యాం, కూడలి సంగమం, బాదామి, హైవోలి తదితర ప్రాంతాలు సందర్శించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పుస్తక పఠనంతో పాటు క్షేత్ర స్థాయి పర్యటనలు మరింత విజ్ఞానాన్ని అందిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, సాయికిరణ్, అంబర్‌నాథ్, వినయ్, నవీన్, ప్రియాంక, విజయమ్మ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



మద్దూరు: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచడం, రైతులకు సొంత పూచికత్తుపై రూ. 5లక్షల వరకు రుణాల పొందే విధంగా వెసులుబాటు కల్పిండంపై మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మద్దూరు పాత బస్టాండ్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు బడ్జెట్ చేసినా మేలును ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం సాధించాలని కార్యకర్తలకు పార్టీ మండలాధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, రాఘవేంద్రాచారి, మేకల శ్రీనివాస్, మల్లేష్, లాలు, బాలకృష్ణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు ఎంపిక



నారాయణపేట : జాతీయస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు జాదోజయ ఎంపికైనట్లు పీఈటీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లింగంపల్లి తండాకు చెందిన జాదోజయ ప్రస్తుతం హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. ఉత్తరాఖండ్‌లో ఈనెల 8 నుంచి 13 వరకు జరుగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనుంది. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు, అధికారులు అభినందనలు తెలియజేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మద్దూరులో షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో ఆర్థిక భరోసా, పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల సముదాయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 110 మంది లబ్ధిదారులకు కల్యాణలమీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు సుమారు రూ.15 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్త విజయ్‌కుమార్, తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ..

మద్దూరు/కొత్తపల్లి: మండల పరిధిలోని 108 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శుక్రవారం మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందింపుచ్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో రెండు మండలాల తహసీల్దార్లు మహేష్‌గౌడ్, జయరాములు, కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, హనిమిరెడ్డి, బాబుస్వామి, మల్లికార్జున్, పురుషోత్తం, జనర్ధాన్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం..

మక్తల్ : ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇంటింటా సౌభాగ్యం నిండుతుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అభయహస్తం కార్యక్రమంలో భాగంగా రూ.500 ఎల్‌పీజీ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా పథకాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 168 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసినట్లు తెలిపారు. మక్తల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నూరిద్దీన్, కట్ట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



బొడ్రాయి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ధన్వాడ : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం పీఠదేవత ఆహ్వాన పూజ, అన్నంతో బలిహరణం, గర్తపూజ, యంత్ర ప్రతిష్ఠ, ప్రాయశ్చిత హోమం నిర్వహించి 11:30 గంటలకు బొడ్రాయిని ప్రతిష్ఠించారు. అనంతరం మహా మంగళహారతి, అన్నదానం చేశారు. మహిళలు నవధాన్యాలు వేసి హారతులు ఇచ్చి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వాయుపుత్ర కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయికులు

నారాయణపేట రూరల్ : వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్మా నాయకులు అన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శృతిలయ కల్చరల్ అకాడమీ ద్వారా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. స్థానిక కృష్ణ గోకులం కళాశాలలో ట్రస్మా నాయకుల చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 25 నుంచి మే 25 వరకు, నారాయణపేట జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 8 వ తరగతి విద్యార్థులను ల్యాంగ్వేజ్, లైఫ్ స్కిల్స్‌లో శిక్షణ, కల్చరల్, కార్యక్రమాల్లో 30 రోజుల పాటు అవగాహన ఇచ్చి సర్టిఫికెట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎండీ ఖదీర్, రాజేష్ కుమార్, కోశాధికారి భరత్, ఆ సంస్థ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్‌చార్జి బాలకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి పవన్ కల్యాణ్, మండల ఇన్‌చార్జిలు అంజలి, శిరీష, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మయ్య



లక్ష్మయ్యకు నియామక పత్రం అందజేస్తున్న యుగంధర్ గౌడ్

మక్తల్ : బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన లక్ష్మయ్య ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్ర పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేంధర్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆయన అందుకున్నారు. అనంతరం రాష్ట్ర చైర్మన్ యుగేంధర్ గౌడ్‌కు పూలమాల శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వివిధ మండలాలకు చెందిన బీసీ నాయకులు సమావేశంలో ఏకగ్రీంగా ఎంపిక చేశారు. చిట్యాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీలను చైతన్యం చేసి అభివృద్ధి బాటలో ఉంచుతానన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులను సిద్ధం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కల్లూరి నాగప్ప, తిరుపతయ్య, మారుతిగౌడ్, నర్సింములు, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్, రాములు, శ్రీకాంత్, గౌతమ్, నాగరాజు, రామస్‌గౌడ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



వాగు నుంచి ఇసుక తీసిన దృశ్యం

మాగనూర్: మండలంలో ఇసుక అక్రమ వ్యాపారం యథేచ్చగా కొనసాగుతోంది. ఒకవైపు అధికారులు మండలంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో భాగంగా అన్ని రకాల అనుమతులను రద్దు చేసి ఇసుక తరలింపును నిలుపుదల చేయగా, మండలంలోని కొందరు ఇదే అదునుగా చేసుకుని ప్రతిరోజు రాత్రి పది గంటల తర్వాత ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తు సోమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణాకు గజ్జరందొడ్డి, మందిపల్లి, వర్కూర్, వడ్వాట్ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుక రవాణా సాగిస్తున్నారు. ట్రాక్టర్ల యాజమానులు కొందరు పోలీసు, రెవెన్యూ సిబ్బంది అండదండలతో ఇసుక రవాణా చేస్తున్నాట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

మార్పు చేర్పులకు అవకాశం

కొత్తపల్లి : గ్రామీణ ప్రాంత వాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పుల కోసం రాష్ట్ర పౌర సంబంధాల శాఖ శుక్రవారం అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా కొత్తపల్లి తహసీల్దార్ జయరాములు ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుల్లో మార్పులు మీసేవ కేంద్రాలను సంప్రదించాలని పేర్కొన్నారు.